

కార్పొరేట్ శక్తులపైనే పోరాటం
కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే తమ పోరాటమని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. - 8లో▸



16 రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత
కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో గల బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ పనులతో ఆసిఫాబాద్, రెచ్నీలో పలు రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేశారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$31^0/19^0$
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

ఎదురుచూపులు

వేతనాల కోసం ఆర్పీల నిరీక్షణ
- ఏడు నెలలు గడుస్తున్నా గత్యంతరం లేని వైనం
- పెంచుతున్నట్లు ప్రకటించిన గతప్రభుత్వం

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నా.. క్షేత్ర స్థాయిలో పథకాలు అమలు కావాలన్నా.. మెప్మాకు చెందిన ఆర్పీ(రిసోర్స్ పర్సన్)ల భాగస్వామ్యం కీలకం. ఏ ఒక్క శాఖకు సంబంధం లేకుండా ప్రతి దాంట్లో వీరి పాత్ర ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఆర్పీలకు ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం వీరి వేతనాన్ని పెంచుతామంటూ నిర్ణయం తీసుకున్న తర్వాతే నిలిచిపోవడం గమనార్హం. అంతకు ముందు ప్రతినెలా క్రమం తప్పకుండా రాగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మరుసటి నెల నుంచి పెరిగిన జీతంతో ఖాతాల్లో జమ చేస్తారని ఆశతో ఎదురు చూడగా.. ఏడు నెలలైనా వేతనాలు అందలేదు. ఇటీవల ప్రజావాణిలో వేతనాల కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు ఆర్పీలు.

మహిళాభివృద్ధిలో కీలక పాత్ర
మున్సిపాలిటీ పరిధిలోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఆయా కాలనీల్లో ఆర్పీల విధులు సంఘాలు ఏర్పాటు చేస్తారు. అవసరం మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తూ.. వారి చిరు వ్యాపారాలకు భరోసా కల్పించేలా ప్రోత్సహిస్తారు. 25 సంఘాలకు ఒక సమాఖ్య ఉంటుంది. దీనికి ఆర్పీ బాధ్యురాలిగా ఉంటారు. అలా భూపాలపల్లి మున్సిపాలిటీలో 29 ఆర్పీలు ఉన్నారు. 760 మహిళా గ్రూపులు, సమాఖ్యలు కొనసాగుతున్నాయి. ఈ సంఘాల్లో వేలాదిమంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపుల మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలిప్పించడం, రికవరీ చేయించడం. ప్రతి నెలా గ్రూపుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా సాధికారత అభివృద్ధి కార్యక్రమాలపై ఆర్పీలు మహిళలకు అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం ప్రతినెలా గౌరవ వేతనంగా రూ.4వేలు ప్రభుత్వం అందిస్తుంది. ఈక్రమంలో ఏడు నెలల కిందట అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2వేలు పెంచుతున్నట్లు ప్రకటించింది. కానీ, అప్పటినుంచి వీరికి సక్రమంగా వేతనాలు అందడంలేదు.


సమావేశంలో పాల్గొన్న మహిళా సమాఖ్య గ్రూపు సభ్యులు (ఫైల్)


ఇటీవల వేతనాలు ఇప్పించాలని కలెక్టర్‌ను కలిసిన ఆర్పీలు(ఫైల్)

పెరిగిన వేతనం వచ్చేనా.. ?
2018 సంవత్సరం నుంచి ఆర్పీలకు గౌరవ వేతనంగా రూ. 4వేలు ప్రభుత్వం అందజేస్తుంది. వీరి కృషిని గుర్తించి 2023 అక్టోబర్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ756 ద్వారా మరో రూ.2వేలు పెంచి మొత్తం రూ.6వేలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గతేడాది జూలైనుంచి ఇప్పటి వరకు పాత, కొత్త వేతనాలు జమ కాకపోవడంతో ఆర్పీలు అప్పులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పెరిగిన వేతనాలు అమలు చేస్తూ.. ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించాలని ఆర్పీలు కోరుతున్నారు.

ప్రజా పాలన విధులు..
రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాలను ప్రవేశపెట్టింది. ఆ పథకాలకోసం గ్రామాల్లో వీఓఏలు, మున్సిపాలిటీల్లో ఆర్పీలు అర్హులైన కుటుంబాలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు పూర్తి చేయడం, వారికి పథకాలపై అవగాహన కల్పించడం లాంటి పనులు చేశారు. గత ఎన్నికల్లో బీఎల్‌ఓలుగా విధులు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కొత్త ఓటర్లను ఓటు నమోదు చేయించారు. ఎన్నికలకు ముందు ఓటరు స్లిప్‌లను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు.

కనీస వేతనం అందించాలి
గత ఏడాది జూలైనుంచి వేతనాల రావడం లేదు. దీంతో అప్పులు చేసి కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్పీల కనీస వేతనం రూ.18వేలకు పెంచి, నేరుగా ఆర్పీల ఖాతాల్లో జమచేయాలి. అంగన్‌వాడీ టీచర్ల మాదిరిగా డ్రెస్ కోడ్ ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేయాలి.
- చిప్ప ఉమ, ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా
- కేజీబీవీలో ఉపాధ్యాయుల బోధనపై అసంతృప్తి

కాటారం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో ఉపాధ్యాయులు బోధించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కాటారం మండల కేంద్రంలోని కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాల, అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిని కలెక్టర్ పర్యవేక్షించారు. రేయిన్ వాటర్ హార్వెస్టింగ్‌లో భాగంగా పండిస్తున్న కూరగాయ మొక్కలను పరిశీలించి, పిల్లలకు అందజేస్తున్న పోషకాహార వివరాలను అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న కిచెన్ షెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో డ్రెయినేజీ వ్యవస్థ పాడై దుర్వాసన వెదజల్లుతుండటంతో మరమ్మతులకు కావాల్సిన అంచనాలను తయారు చేసి ప్రతిపాదనలు అందజేయాలని పంచాయితీరాజ్ అధికారులకు సూచించారు. నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల వెనకభాగంలోని గడ్డి, పిచ్చి మొక్కలను తొలిగించి పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులలకు కలెక్టర్ ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించారు. పలు సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడగ్గా.. వారు ఇచ్చిన సమాధానాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయినులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యం పెంపొందించే చర్యలు చేపట్టి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే పదో తరగతి సెలబస్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు, సెక్టోరియల్ అధికారి కిషన్‌రావు, సీడీపీఓ రాధిక, కేజీబీవీ ఎస్‌ఓ చల్ల సునీత, పీఆర్ ఏఈ అశోక్, తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్‌ల ఏర్పాటు


మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్‌లతో మాట్లాడుతున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కంపెనీ ఉత్పత్తి వ్యయం, పనితీరును మెరుగుపరిచి ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు యాజమాన్యం మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీల పనితీరు, ఉత్పత్తి వ్యయం, సంక్షేమ కార్యక్రమాలపై సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు వెంకటయ్య, జోతి, కవీంద్ర. రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రసాద్, తుకారాం, రవికుమార్, అన్ని విభాగాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు బుధవారం భారీగా తరలిరావడంతో ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పస్రా నుంచి మేడారం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా 500 మంది పోలీసు సిబ్బంది పక్కా ప్రణాళికతో బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో భాగంగా ఎస్పీ శబరీశ్, 25 రూట్‌లో మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసి రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించారు. మొబైల్ పెట్రోలింగ్‌లో ఎస్పీ స్వయంగా పాల్గొని రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలపకుండా గస్తీ నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు నిలపకుండా అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మేడారంలో పార్కింగ్ స్థలాలను పరిశీలించి వాహనాల రద్దీకి అనుగుణంగా వివిధ పార్కింగ్ స్థలాలకు భక్తుల వాహనాలను మళ్లించారు.

ఇన్‌చార్జ్ డీఈఓగా అబ్దుల్‌హై బాధ్యతల స్వీకరణ




ములుగు: ములుగు ఇన్‌చార్జ్ డీఈఓగా అబ్దుల్ హై బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ అబ్దుల్ హై మాట్లాడుతూ.. 10వ తరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఎస్టీయూ టీఎస్ డైరీని డీఈఓ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు ఎళ్ల మధుసూదన్, శిరుప సతీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మూడ్ కసన్‌సింగ్, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనంతుల సురేందర్, సామల శ్రీనివాసులు, డీసీఈబీ సెక్రటరీ విజయమ్మ, కో ఆర్డినేటర్లు బద్దం సుదర్శన్‌రెడ్డి, అర్షం రాజు, సాంబయ్య, రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, విక్రమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలి



ఏటూరునాగారం: ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని డీడబ్ల్యూఓ ప్రేమలత అన్నారు. మండల పరిధిలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత శుభ్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం డీడీ పోచం మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. గిరిజన విద్యాసంస్థల్లోని కుక్‌లు, వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు, హెడ్మాస్టర్లకు రెండు రోజుల శిక్షణలో వివరించిన సూచనలు, సలహాలను పాటించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రవీందర్, సీపీఓ కృష్ణవేణి, వైద్యురాలు అనుమిషియా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, పీజీ హెచ్‌ఎం సారంగపాణి, వార్డెన్లు పాల్గొన్నారు.

మేడారానికి సీతక్క అభిమానుల పాదయాత్ర



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మంత్రి సీతక్క అభిమానులు బుధవారం తాడ్వాయి నుంచి మేడారానికి పాదయాత్ర చేశారు. కన్నాయిగూడెం మండల పరిధిలోని బుట్టాయిగూడేనికి చెందిన గుంటి రాజు, ముప్పనల్లి గ్రామానికి చెందిన బాల్ రాజులు సీతక్క ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి వస్తే పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నారు. కోరిక నేరవేరడంతో వారు సీతక్క ఫ్లెక్సీతో మేడారం అమ్మవార్ల గద్దెల వరకు చేరుకుని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి


అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

మొగుళ్లపల్లి: మండలంలోని మొగుళ్లపల్లి– ములకలపల్లి గ్రామాల మధ్య జరుగనున్న సమ్మక్క–సారలమ్మ జాతర స్థలాన్ని బుధవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరలో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. విద్యుత్‌దీపాలు, స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సునిత, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, నరేష్ ఉన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

జిల్లా విద్యాధికారి రామ్‌కుమార్


విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న డీఈఓ

టేకుమట్ల: టెన్త్‌లో విద్యార్థులు పది జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రామ్‌కుమార్ అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలను బుధవారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేసి, పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల నిర్వహణ, సిలబస్‌పై ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతతోపాటు 10జీపీఏ కోసం ప్రతీ రోజు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ విద్యాభ్యాసంలో ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పలు సలహాలు సూచనలు చేశారు.

విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుధీర్

కాటారం: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని హైదరాబాద్‌కు చెందిన సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సాంద్ర అన్నారు. స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలా ఒత్తడిని జయించాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి కల్యాణమంటపంలో బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో సుధీర్ సాంద్ర, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కోమల్ ప్రీత్ కౌర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఏ మాత్రం ఒత్తడికి గురైనా ఉత్తీర్ణతపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా పాఠాలను ఇష్టపడి చదివితే విజయం సాధించవచ్చని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో ముందుకెళ్తే తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. సమయం ఎంతో విలువైందని పరీక్షలు సమీపిస్తున్నందున సమయం వృథా చేయ్యొద్దని తెలిపారు. విద్యార్థులపై సెల్‌ఫోన్, సోషల్ మీడియా ఎంతో ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను వాటికి దూరంగా ఉంచాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కార్యక్రమానికి హాజరైన వక్తలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాటారం ఎస్సై అభినవ్, మెటామైండ్ ఐఐటీ అకాడమి చైర్మన్ మనోజ్, యోగాచార్యులు గౌరోజు సదానందం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొట్టె సతీశ్, సీఆర్పీఎఫ్ జవాన్ మనోహర్, సుమన్, ఆదిత్య, సాయి పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

భూపాలపల్లి అర్బన్: నేడు(గురువారం) నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి దేవరాజం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విడుతల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 891 మంది ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు, 220 మంది ఒకేషనల్ ప్రథమ సంవత్సరం, 234 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని, పరీక్షలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై 'ఓరుగల్లు' ఆశలు

- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులివ్వాలి
- మేడారం జాతరకు జాతీయ హోదా వచ్చేనా?
- గిరిజన వర్సిటీ పనుల్లో వేగిరం పెంచేలా చూడాలి
- కాకతీయ మెగా టెక్స్‌టైల్‌కు మిత్ర సహాయం పెంచాలని డిమాండ్
- పెండింగ్ రైల్వే పనులకు మోక్షం కలిగేనా..

నేడు పార్లమెంట్‌లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్



సాక్షి, వరంగల్: ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం ఓట్ ఆన్ అకౌంట్ చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ తరుణంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై అన్ని వర్గాలు ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల విడుదలపై ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ మామునూరు విమానాశ్రయం, పీఎం మిత్ర కింద ఎంపికైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, ములుగులోని గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేటాయించిన రూ.900 కోట్ల నిధుల విడుదలతోపాటు ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ హోదా ఇచ్చి నిధులు కేటాయించాలని డిమాండ్ వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన కాకతీయ కాలంనాటి ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపును చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. కొత్త జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రులను ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయంటున్నారు.

ఈ రైల్వే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి...
కాజీపేట మీదుగా బల్లార్షా–విజయవాడ మూడో లైన్ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుండగా, కాజీపేట డివిజన్ ఏర్పాటు, బల్లార్షా–కాజీపేట ఫోర్త్ లైన్ నిర్మాణం ఇంకా పెండింగ్‌లో ఉంది. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వేలైన్ సర్వే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కాజీపేట–హసన్‌పర్తి– హుజూరాబాద్–కరీంనగర్ కొత్త రైల్వే లైన్ సర్వే ప్రతిపాదనలు దాటలేదు. కొత్తగూడెం, మణుగూరు నుంచి తాడ్వాయి అడవుల మీదుగా రామగుండం, భూపాలపల్లికి రెండు మార్గాల్లో సర్వే కోసం గతంలో బడ్జెట్‌లో ప్రతిపాదనలు రాగా ప్రైవేట్ సంస్థతో సరిపెట్టారు. కాజీపేట అయోధ్యపురంలో నిర్మిస్తున్న పీరియాడికల్ ఓవర్ హాల్టింగ్ షెడ్ (పీఓహెచ్) నిర్మాణ పనులు వేగిరం చేసేలా మరిన్ని నిధుల కేటాయింపు అవసరం ఉంది.

మామునూరులో విమానం ఎగిరేనా..
ఇప్పటికే ఉడాన్ (ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్) కింద ఎంపికైన వరంగల్ మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం 707 ఎకరాల భూమి ఉండగా, మరో 400 ఎకరాల భూమిని సేకరించాలని గుర్తించారు. వీరికి నష్టపరిహారంగా సుమారు రూ.130 కోట్లు అవసరం. రన్ వే మరమ్మతులు, విద్యుత్, నీరు, రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించి విమాన ప్రయాణాలను ప్రారంభించేలా కేటాయింపులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాకతీయకు 'మిత్ర' సహాయం పెంచాలి..
రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పీఎం మిత్రలో ఇప్పటికే ఎంపికైంది. పార్క్ త్వరిత అభివృద్ధికి రూ.కోట్లలో నిధులు కేటాయించడం ద్వారా మరిన్ని వస్త్ర పరిశ్రమలు ఇక్కడికి వచ్చే అవకాశముంది. అదేవిధంగా వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కలర్‌డైయార్న్ మిల్లులను కూడా ఏర్పాటుచేసేలా బడ్జెట్ కేటాయిస్తే ఇబ్బందులు తప్పుతాయని చేనేత కార్మికులు ఆశిస్తున్నారు.

సమావేశాలకు రాకుంటే సరెండరే..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, అధికారులు, తదితరులు

చిట్యాల: అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి రాకుంటే ఇక నుంచి సరెండర్ చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడారు. ముందుగా వివిధ శాఖల అధికారుల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని అన్నారు. సమావేశాలకు అధికారులు రాకుంటే సరెండర్ చేస్తామన్నారు. వచ్చే వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు. మండలంలో విద్యుత్ సమస్య లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో భూ సమస్యలను పరిష్కరించే విధంగా తహసీల్దార్ చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారిపట్టిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన చెరువుల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కబ్జాకు గురైన చెరువులకు రెవెన్యూ అధికారులతో హద్దులు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. చిట్యాల ఆస్పత్రిలో నాలుగు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం మండలంలోని సర్పంచ్‌లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ, డీపీఓ ఆశాలత, డీఆర్‌డీఓ పురుషోత్తం, మత్స్యశాఖ అధికారి అవినాష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, డీడబ్ల్యూఓ నాగేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సాగర్, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ సుమన్ పాల్గొన్నారు. మండలంలోని గుంటూరుపల్లి, వరికోల్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్‌లు పువ్వాటి రాణివెంకన్న, పెండెల సాంబయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

'విజ్ఞాన్' మహోత్సవ్‌కు పద్మశ్రీ సమ్మయ్యకు ఆహ్వానం


గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోని విజ్ఞాన్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి 3వ తేదీ వరకు జరిగే నేషనల్ లెవల్ యూత్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యకు ఆ విశ్వవిద్యాలయం డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రతినిధి డాక్టర్ ఎంఎస్ఎస్ రుక్మిణీ ఆహ్వానం పలికారు. ఈ మహోత్సవంలో చిందు యక్షగాన కళాకారుడిగా గడ్డం సమ్మయ్యతోపాటు ఇండియన్ ఫిలిం యాక్టర్స్ దివ్య శ్రీపాద, కిరణ్ అబ్బవరం, మ్యూజిక్ కంపోజర్ కుంచె రఘు, ఇండియన్ క్రికెట్ టీమ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్, స్క్రీన్ రైటర్ బుర్ర సాయి మాధవ్, యాక్టర్ చెముడు హర్ష పాల్గొననున్నారు. ఈ విషయమై గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ తాను బతుకుదెరువు కోసం కులవృత్తి వారసత్వంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చిన తరుణంలో అదే గుర్తింపుతో పురస్కారం రావడం.. తిరిగి కళావేదికల్లో అవకాశం రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. 5 లక్షల మేర నష్టం

రామన్నపేట : వరంగల్ బట్టలబజార్‌లోని మమతా మ్యాచింగ్ సెంటర్‌లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నిర్వాహకులు షాపు మూసివేసిన తరువాత షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగి అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో రూ. 5 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు.

ట్రాలీ మీద పడి యువకుడి మృతి


బాలకృష్ణ (ఫైల్)

తరిగొప్పుల: ట్రాక్టర్ మరమ్మతులు చేస్తుండగా ట్రాలీ(డబ్బా) మీద పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై దూదిమెట్ల నరేష్ కథనం ప్రకారం తరిగొప్పుల గ్రామానికి చెందిన కర్రె చంద్రయ్య, కోమలత దంపతుల కుమారుడు బాలకృష్ణ(18) ట్రాక్టర్ ట్రాలీ(డబ్బా) జాకీ మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాలీ ఒక్కసారిగా మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో రైతు..


ఐలుమల్లు(ఫైల్)

కేసముద్రం: ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పూజారి ఐలుమల్లు (51) తన వ్యవసాయ భూమిలో నాటు వేసేందుకు గాను పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై పంట పొలంలో కుప్పకూలి మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే పోరాటం

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- బీజేపీని ఓడించకపోతే హక్కులుండవ్
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- పబ్లిక్‌గార్డెన్‌లో సీఐటీయూ బహిరంగ సభ
- హాజరైన వేలాది మంది కార్మికులు


సభకు హాజరైన కార్మికులు




మహాసభల్లో అభివాదం చేస్తున్న అతిథులు, నాయకులు, మాట్లాడుతున్న తపన్‌సేన్

హన్మకొండ చౌరస్తా: కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీ, కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైనే తమ పోరాటమని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాసలో జరగనున్న సీఐటీయూ ఆలిండియా వర్కింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా మొదటి రోజు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని డాక్టర్ నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో బుధవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి తపన్‌సేన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్న మోదీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె అభినందనీయమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో జరగని అభివృద్ధి, పదేళ్లలోనే జరిగిందని బీజేపీ నేతల ప్రచారం చేస్తున్నారన్నారు. గతేడాది నవంబర్ 26, 27, 28 తేదీల్లో దేశ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా చేపట్టిన సహాపదావ్‌లో ఏడు లక్షల మంది కార్మికులు పాల్గొని మోదీ సర్కార్‌ను హెచ్చరించారన్నారు. బీజేపీ.. మతాన్ని అడ్డుపెట్టుకుని రాబోయే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని, ఇందులో భాగంగా అయోధ్యలో రామాలయ నిర్మాణం సాధ్యమైందని ప్రచారం చేసుకుంటుందన్నారు. ఫిబ్రవరి 18వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దేశంలో హక్కులుండవన్నారు. దేశంలో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగం, హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. ప్రశ్నించే కవులు, మేధావులు, ఉద్యమకారులను మోదీ జైల్లో పెట్టించారని విమర్శించారు. దేశంలో సనాతన ధర్మాన్ని అమలు చేస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారని, సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్మిక పోరాటాలను అణిచివేసినందుకే కార్మికులు బీఆర్ఎస్‌ను ఓడించి కేసీఆర్‌ను గద్దె దింపారన్నారు. సమావేశంలో సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి వీఆర్ సందు, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, రాగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎం రజిత, బొట్ల చక్రపాణి, ఎం చుక్కయ్య, సారంపల్లి వాసుదేవరెడ్డి, బాధ్యులు దొగ్గెల తిరుపతి, గొడుగు వెంకట్ పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ


మాట్లాడుతున్న పశ్య పద్మ

హన్మకొండ : కౌలు రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో 'కౌలు రైతులు-వారి జీవనోపాధి' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో పశ్య పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లోనూ కౌలు రైతులను లబ్ధిదారులుగా చేర్చుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతు రక్షణకు చట్టాలున్నా అవి వారిని ఆర్థికంగా ఆదుకోలేకపోయాయన్నారు. ప్రభుత్వ పథకాలలో కౌలు రైతులను విస్మరించి అన్యాయం చేశాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన కౌలుదారుల గుర్తింపు చట్టం తెలంగాణ రాష్ట్రంలో అమలుకు నోచుకోలేదన్నారు. కౌలు రైతులకు న్యాయం చేయాలంటే భూ యజమానుల ఆందోళన అడ్డంకిగా మారిందన్నారు. అందుకే కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందించాలన్నారు. అలాగే, గ్రామ సభలు నిర్వహించి కౌలు చేసుకునే వ్యవసాయ కుటుంబాల గణన చేయాలని సూచించారు. వీరికి కౌలు గుర్తింపు కార్డులు అందించాలని, ప్రతి సంవత్సరం గ్రామ సభల ద్వారా వీరి జీవనోపాధి కొనసాగుతుందా లేదా నిర్ధారించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంత్ రావు, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెట్టం నారాయణ, ప్రధాన కార్యదర్శి కొప్పుల సూర్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యామసుందర్ రెడ్డి, కార్యదర్శి కొంగల రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా?




హసన్‌పర్తి: ముగ్గురు దారి దోపిడీ దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ దారి దోపిడీ ముఠా వంగపహాడ్‌లోని జాతీయ రహదారిపై హల్‌చల్ సృష్టించినట్లు తెలిసింది. దారి వెంట వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.15వేలు లాక్కున్నట్లు సమాచారం. కాగా, స్థానికులు పోలీసులకు కాల్ చేయడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

దాడి ఘటనలో నలుగురికి జైలు

- ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని ఆముదాల గడ్డతండాలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన నలుగురికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తాహెర్ బాబా బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2016 సంవత్సరంలో ఆముదాల గడ్డతండా శివారు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వేప చెట్టు నరికిన విషయంలో మాలోతు తలస్యతో మాలోతు జగన్, కస్య, సింగన్న, శంకర్‌కు గొడవ జరిగింది. ఈ క్రమంలో తలస్యపై దాడి చేయడంతో మరిపెడ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు నలుగురిపై ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్సై జి. బాబులాల్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. గణేష్ ఆనంద్ వాదించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి సరిత.. నిందితులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

మెట్ల బావిని సందర్శించిన విదేశీయుడు


మెట్ల బావిని పరిశీలిస్తున్న అమెరికా దేశస్తుడు

ఖిలా వరంగల్: వరంగల్-ఖమ్మం రోడ్డుపై శివనగర్‌లోని చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్లబావి (రాణిరుద్రమదేవి స్నానాల బావి)ని బుధవారం అమెరికా దేశస్తుడు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన బావి నిర్మాణ శైలిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బావి గోడలపై ఉన్న శిల్ప సౌందర్యాలను ఆసక్తిగా కెమెరాలో ఫొటోలు తీసుకున్నారు. బావి విశిష్టత, నిర్మాణ శైలిని బావి పరిరక్షణ కమిటీ సభ్యుడు బజ్జూరు అంజయ్య అతడికి వివరించారు. అనంతరం విదేశీయుడు మధ్యకోటను సందర్శించారు. ఆయన వెంట టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, పురావస్తుశాఖ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరి బాలికను ఆదుకోరూ!

- తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి
- ఆపన్న హస్తం అందించాలని బంధువులు, గ్రామస్తుల వేడుకోలు


రేణుక


చిన్నారి నివసిస్తున్న టెంట్

దీన గాథ

రాయపర్తి : శత్రువులకు కూడా ఇలాంటి దుస్థితి రావొద్దేమో. అనారోగ్యంతో కొంతకాలం క్రితం తండ్రి.. అదే కారణంతో ఇటీవల తల్లి కూడా మృతి చెందింది. దీంతో ఓ బాలిక అనాథ అయింది. ఆలనాపాలన చూసేవారు లేక అల్లాడుతోంది. తినడానికి తండి లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దీంతో ఆ బాలిక పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. ఈ హృదయవిదారక ఘటన మండలకేంద్రంలోని అంబేడ్కర్‌కాలనీలో నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఐత యాకయ్య, కొమురమ్మ దంపతులకు కుమార్తె రేణుక (10) ఉంది. ఈ దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. ఈ క్రమంలో కొంతకాలం క్రితం యాకయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కన్నీళ్లు దిగమింగుకుని రెక్కలు ముక్కలు చేసుకుంటూ కొమురమ్మ తన కూతురు రేణుకను పోషించుకుంది. ఈ క్రమంలో కొమురమ్మ కూడా అనారోగ్యంతో ఈనెల 27న మృతి చెందింది. దీంతో తల్లిందండ్రులను కోల్పోయిన రేణుక పరిస్థితి హృదయ విదారకరంగా మారింది. తినడానికి తిండి లేదు. ఉండానికి ఇల్లు లేదు. ఫలితంగా బాలిక పరిస్థితి నడిసంద్రంలో నావాలా తయారైంది. కాగా, మృతులది పూరిల్లు కావడంతో వర్షాల కారణంగా పూర్తిగా కూలిపోయింది. దీంతో కొన్ని రోజులుగా టెంట్ కిందే జీవనం కొనసాగిస్తున్నారు. దీనిపై దాతలు ముందుకువచ్చి బాలికను ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, రేణుకకు మండలకేంద్రంలోని వెంకటరమణ ఐరన్ అండ్ సిమెంట్స్, పెయింట్స్ షాపు యజమాని ఉల్లెంగుల వెంకన్న రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

దాతలు స్పందించి 9963941016 ఈ నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

16 రైళ్లకు ఆసిఫాబాద్, రేచ్నీలో హాల్టింగ్ ఎత్తివేత

- నేటినుంచి అమలు
- మూడో రైల్వే లైన్ పనులతో నిర్ణయం



కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో గల బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ పనులతో ఆసిఫాబాద్, రేచ్నీరోడ్ రైల్వేస్టేషన్లలో కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు గురువారం నుంచి 19వ తేదీ వరకు తాత్కాలిక హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఆసిఫాబాద్‌లో హాల్టింగ్‌లను ఎత్తివేసిన రైళ్లు ఇవే..

కాజీపేట-సిర్పూర్ టౌన్ (17003) ప్యాసింజర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, భద్రాచలం-సిర్పూర్ టౌన్ (17033) సింగరేణి, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17012) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ టౌన్-భద్రాచలం (17034), కరీంనగర్-సిర్పూర్ టౌన్ (07765) ప్యాసింజర్, సిర్పూర్‌టౌన్-కరీంనగర్ (07766) ప్యాసింజర్, సింగరేణి, బల్లార్షా-కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్.

రేచ్నీలో హాల్టింగ్ తొలగించిన రైళ్లు ఇవే

హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17012) ఎక్స్‌ప్రెస్ కరీంనగర్-సిర్పూర్ టౌన్ (07765) ప్యాసింజర్, సిర్పూర్ టౌన్-కరీంనగర్ (07766) ప్యాసింజర్. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి రైల్వేకు సహకరించాలని అధికారులు కోరారు. మూడో రైల్వేలైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు


ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన కూలీలు

వెంకటాపురం(కె): మండలంలోని పాత్రాపురం గ్రామ శివారులో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మిర్చి పంటను తెంపడానికి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 మంది కూలీలు మండలానికి వచ్చారు. ఈ క్రమంలో వంట చెరుకు కోసం బుధవారం అడవికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న 20 మంది కిందపడ్డారు. ఇందులో ఆరుగురికి గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను వెంకటాపురం(కె) వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అంగన పల్లి రీనా, బద్దం మీన, కుడియం మాసికి స్వప్న, పర్షిక నీల, పర్షిక సాకిత, కుడియ రత్మికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డేరాల్లో సోలార్ వెలుగులు


డేరాకు ఏర్పాటు చేసి సోలార్


రాత్రి సమయంలో వెలుగుతున్న సోలార్‌లైటు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన వారు బతుకుదెరువు నిమిత్తం రాయపర్తికి వచ్చారు. ప్లాస్టిక్ డబ్బాలు, బుట్టలు ఇతర వస్తువులను ఊరూరా తిరిగి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు బసచేసే ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో సోలార్ ప్లేట్ ఆధారంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. రాత్రిపూట వెలుగుతోపాటు సెల్‌ఫోన్లకు చార్జింగ్‌కు ఉపయోగపడుతున్నట్లు సదరు వ్యాపారులు తెలిపారు.

- రాయపర్తి

పలు విభాగాలకు అధిపతుల నియామకం

కాకతీయ యూనివర్సిటీలోని పలు విభాగాలకు అధిపతులను నియమించారు. రిజిస్ట్రార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్, పరీక్షల నియంత్రణాధికారి, యూనివర్సిటీ పీజీ కళాశాల, తదితర విభాగాలకు హెచ్‌ఓడీలను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు.

కేయూ రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యుడు పి.మల్లారెడ్డిని నియమించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో మల్లారెడ్డిని నియమిస్తూ వీసీ తాటికొండ రమేష్ అప్రూవల్ మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శ్రీనివాస్‌రావు నుంచి మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మల్లారెడ్డి మ్యాథమెటిక్స్ విభాగంలో 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కొన్నేళ్లుగా ప్రొఫెసర్‌గా కొనసాగారు. ప్రస్తుతం సైన్స్‌డీన్‌గా కొనసాగుతున్నారు.

దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా రాంచంద్రం



కాకతీయ యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్‌గా దూరవిద్యకేంద్రంలో జాయింట్‌డైరెక్టర్‌గా ,సైకాలజీ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆచార్య వి రాంచంద్రంను నియమిస్తూ రిజిస్ట్రార్ టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. దూరవిద్యకేంద్రం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రావు పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో రాంచంద్రంను నియమించగా బాధ్యతలు స్వీకరించారు.

యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వరలక్ష్మి



కేయూ పరిధిలోని హనుమకొండ సుబేదారిలో ఉన్న యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పి వరలక్ష్మిని నియమిస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న అమరవేణిని క్యాంపస్‌లోని కామర్స్‌కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించడంతో ఆస్థానంలో వరలక్ష్మిని నియమించారు.

పరీక్షల నియంత్రణాధికారిగా నర్సింహాచారి



కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ నర్సింహాచారిని నియమిస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మల్లారెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించడంతో ఆయన స్థానంలో నర్సింహాచారిని నియమించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏటీబీటీ ప్రసాద్



కేయూలోని ఫిజికల్ ఎడ్యూకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్‌ను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలో కాంట్రాక్టు ఫిజికల్‌డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏటీబీటీ ప్రసాద్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్‌గా అమరవేణి



కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్‌బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆ కళాశాల ప్రొఫెసర్ పి అమరవేణిని నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నర్సింహాచారిని పరీక్షల నియంత్రణాధికారిగా నియమించడంతో ఆయన స్థానంలో అమరవేణిని నియమించారు.

కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సదానందం



కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సదానందాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.